Office : 9440815774

మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

వ్యవస్థాపకులు : డి.విజయకుమార్

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APETL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక




ప్రచురణ : తిరుపతి - చిత్తూరు | సంపుటి : 02 | సంచిక : 67 | ఎడిటర్ : కే ఎల్ కృష్ణరాజు | సోమవారం 12 అక్టోబర్ 2026 | పేజీలు : 4 | వెల : 2

# విజయవాడ ఉత్సవాలను గ్రాండ్ సక్సెస్ చేయాలి

- ఇంద్రకీలాద్రి శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని సీఎం ఆదేశం
- దసరా సామాన్యుల పండుగలా జరగాలి, వీఐపీలదిగా కాదని స్పష్టం
- అక్టోబర్ 13 నుంచి జాతీయ స్థాయి సరస్ మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు
- విజయవాడ ఉత్సవ్ 2.0తో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలని సూచన
- రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులతో సీఎం సమీక్ష



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ**

విజయవాడలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, త్వరలో ప్రారంభం కానున్న జాతీయ స్థాయి సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్ 2.0లను అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ భారీ కార్యక్రమాల విజయానికి దేవాదాయ, పర్యాటక శాఖలతో పాటు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. మంత్రులు, ఉన్నతాధికారులతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. దసరా ఉత్సవాలు సామాన్యుల పండుగలా జరగాలని, వీఐపీల కోసం కాదని సీఎం స్పష్టం చేశారు. "ఇంద్రకీలాద్రి ఉత్సవాలు సామాన్యుల దసరాగా ఉండాలి, వీఐపీల దసరాగా కాదు. దీనికి అన్ని వర్గాలు సహకరించాలి" అని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు వస్తున్న నేపథ్యంలో, వారి రాక వల్ల సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. వీఐపీల రాకతో విధించే ట్రాఫిక్ ఆంక్షల గురించి ప్రజలకు ముందుగా తెలియజేయాలని, వారి ఇబ్బందులను తగ్గించేందుకు - మిగతా3లో



## ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా భారత్

- 25 నగరాలకు మెట్రో సేవలు
- 13 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- చెన్నై విమానాశ్రయంలో ప్రధానికి ఘన స్వాగతం
- 2014 నుంచి మన ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 11 రెట్లు పెరిగాయి
- తయారీ రంగంలో వృద్ధి వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి
- పరిశ్రమలు, రవాణారంగం హబ్‌గా తమిళనాడు తయారవుతోంది
- రాష్ట్రాలు శరవేగంగా అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యం.

# ఆర్థిక నేరాల కేసుల నుంచి తప్పించుకునేందుకే జగన్ కాలయాపన

- జగన్ అందుకే తప్పుడు కథనాలు, కార్టూన్లతో తప్పుదోవ పట్టిస్తున్నారు: మంత్రి కొల్లు రవీంద్ర
- ఈడీ విచారణకు రాజకీయ రంగు పులుముతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ
- వివేకా హత్య కేసులోనూ జగన్ రాజకీయ నాటకాలు ఆడారని తీవ్ర విమర్శలు
- అవినీతి సొమ్ముతో పెట్టిన సాక్షి పత్రికతో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- కేసుల విచారణ వేగవంతం చేసి నిజాలు బయటపెట్టాలని మంత్రి రవీంద్ర డిమాండ్



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ**

వాస్తవాలను పక్కదారి పట్టించి, వాటిని రాజకీయంగా వాడుకోవడమే జగన్ రాజకీయ నీతి అని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తనపై ఉన్న ఆర్థిక నేరాల కేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ ఎదుటివారిపై నిందలు - మిగతా3లో



## ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి

- ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దు: సుప్రీంకోర్టు
- ఢిల్లీలో అనవసర బారికేడ్ల తొలగింపునకు సుప్రీంకోర్టు ఆదేశం
- ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తప్ప మెట్రో, రైలు సేవలు ఆపవద్దని సూచన
- శాంతియుత నిరసనకారులను అక్రమంగా నిర్బంధించరాదని స్పష్టీకరణ
- నిరసనల వేళ ఆంక్షలపై దాఖలైన పిటిషన్లపై ప్రత్యేక విచారణ
- ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించామని కోర్టుకు తెలిపిన కేంద్రం



# ఏపీలో ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు

- వివిధ అలంకరణల్లో దర్శనమిస్తున్న అమ్మవార్లు
- రాష్ట్ర వ్యాప్తంగా దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి
- అమ్మవారు వివిధ అలంకరణల్లో కొలువై భక్తులకు దర్శనమిస్తున్నారు
- పదిరోజుల పాటు అమ్మవార్లు విశేష అలంకరాల్లో దర్శనం ఇవ్వనున్నారు.
- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైన దసరా శరన్నవరాత్రులు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్ర వ్యాప్తంగా దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. అమ్మవారు వివిధ అలంకరణల్లో కొలువై భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. పదిరోజుల పాటు అమ్మవార్లు - మిగతా3లో





## ఆ చట్టాన్ని సవరించాల్సిందే

- పరీక్షల రోజుల్లో ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతులు నిలిపివేయాలి
- ఎన్‌టీఏ సంస్కరణలపై పార్లమెంటరీ కమిటీ
- ఎన్‌టీఏలో సంస్కరణలు, దాని బలోపేతంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కీలక సూచనలు
- 'ఇన్విజిలేషన్ ఫార్మాలిటీల కోసం 15 నిమిషాల అదనపు సమయం'
- మోదీ సర్కార్ అహంకారం వీడాలి : కాంగ్రెస్

# అడవితల్లి బాట లక్ష్యం అదే

- గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- రాజకీయాలకు అతీతంగా గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా నిధుల కేటాయించాము
- అడవితల్లి బాట 2.0 ద్వారా రూ.2,052 కోట్లతో 2,569 పనులకు శ్రీకారం
- రంపచోడవరం నియోజకవర్గం కాకవాడ గ్రామసభలో కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ముఖ్యంగా యువత భాగస్వాములై గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు ఆదివారం పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కాకవాడలో అడవితల్లి బాట 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రసంగించారు. గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయాలు కల్పించి, వాటిని అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. రహదారుల నిర్మాణం ద్వారా గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, రవాణా, - మిగతా3లో




## ప్రభుత్వం భయపడుతోంది

- అందుకే సీఈసీపై పోరాటాన్ని తమపైకి మళ్లించుకుంది
- సీఈసీకి వ్యతిరేక నిరసనను ప్రభుత్వం తమపైకి మళ్లించుకుంటోంది
- గత 72 గంటల్లో దేశంలో ఎమర్జెన్సీని మించిన అరాచకం చూశాం
- మోదీ, అమిత్ షా ఆదేశాలతోనే ఎన్నికల సంఘం పనిచేస్తోంది
- సీజేపీ వ్యవస్థాపకుడి కుటుంబ విషాదంలో ఢిల్లీ పోలీసుల తీరు అమానుషం
- తమ పోరాటానికి మద్దతిచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులకు కృతజ్ఞతలు

# ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన : ఎమ్మెల్యే బొజ్జల సుధీర్



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 11:**
శ్రీకాళహస్తి దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ మొక్కులో భాగంగా అమ్మవారికి ముక్కుపుడకను కానుకగా సమర్పించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి దుర్గగుడి ఈవో, ఆలయ చైర్మన్, పాలకమండలి సభ్యులు, దేవస్థాన అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా అమ్మవారి దర్శనం అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆలయ క్యూలైన్లలో ఉన్న భక్తులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న సౌకర్యాలు, దర్శన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకుని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి, నిర్వాహకులు, వైద్య సిబ్బందితో మాట్లాడారు. భక్తులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను తెలుసుకుని, అవసరమైన వైద్య సహాయం అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించా ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నుంచి విచ్చేసి కనక దుర్గమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం తనకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం ఈవో వెంకటేశులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్, ఆలయ చైర్మన్ కొట్టే సాయి, పాలకమండలి సభ్యులు, దేవస్థాన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ యువత పై నిర్బంధాన్ని నిరసిస్తూ రేణిగుంట వామపక్షలు నిరసన ధర్నా!

●ఓట్లు దొంగ ఎన్నికల చీఫ్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను అరెస్టు చేయాలి

●వామపక్ష పార్టీలు డిమాండ్.



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్11:**
ఎస్.ఐ.ఆర్ పేరుతో 13 కోట్ల 35 లక్షల ఓటర్లను ఏకపక్ష నిర్ణయాలతో తొలగించి, రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును ధ్వంసం చేసి "ఓటు చోరీ" కి పాల్పడిన కేంద్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి అనర్హుడు, భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును చోరీ చేసిన దేశద్రోహి, అతన్ని తక్షణమే అరెస్టు చేసి జైల్లో పెట్టాలని, ఇప్పటికే తొలగించిన ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చి ఓటు హక్కు కాపాడాలని రేణిగుంట వామపక్ష పార్టీలు సిపిఎం, సిపిఐ డిమాండ్ చేశారు. అక్టోబర్ 10న చలో ఢిల్లీ పిలుపులో భాగంగా "ఓటు చోరీ" చేసిన ఎన్నికల చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను పదవి నుండి తప్పించాలి అదేవిధంగా అరెస్ట్ చేయాలని శాంతియుతంగా జంతర్ మంతర్ వద్ద యువత, వామపక్ష విద్యార్థి నేతలు నిరసన తెలుపుతుంటే కేంద్ర ప్రభుత్వం, పోలీసులు, మిలిటరీ బలగాలను మోహరించి విచక్షణారహితంగా లాఠీ ఛార్జ్ చేయడం, విద్యార్థి నేతలను నిర్బంధించడాన్ని ఖండిస్తూ.. ఆదివారం నాడు రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీలు నిరసన ధర్నా చేపట్టారు. ఓటు హక్కు ప్రతి భారతీయుల సంపద, ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అందుకే మహాత్మా గాంధీ ఉద్యమ స్ఫూర్తితో.. భగత్ సింగ్ రగిలించిన విప్లవం వారసులుగా నేటి యువత ఢిల్లీలో చేసే పోరాటం స్ఫూర్తితో "ప్రజాస్వామ్యాన్ని" రక్షించుకోవడానికి పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఢిల్లీలో యువత, వామపక్ష విద్యార్థి నేతలు చేసే పోరాటానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని ఓట్లు దొంగలించే కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని అధికారం నుంచి గద్దె దించి తన్ని తరిమేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి వైయస్ మణి, మురళి, రజాక్, రమణ, అమ్ములు, దాము, గిరి, వరలక్ష్మి, సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, వెంకటరమణ, శివానందం, ఈశ్వరమ్మ, సత్య శ్రీ, సెల్వరాజ్, దిలీప్ భాషా, మునిస్వామి, అమ్ములు, దస్తగిరి, రాముడు తదితరుల పాల్గొన్నారు.

## కటికపల్లిలో కొబ్బరి చెట్ల నరికివేతపై ఫిర్యాదు



**ఎస్‌ఆర్ పురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్11:**
ఎస్‌ఆర్ పురం మండలం కటికపల్లి గ్రామంలో దేవేంద్ర నాయుడుకు చెందిన ఇంటి పక్కన ఉన్న కొబ్బరి చెట్లు నరికివేతకు గురయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చెట్లను ఎవరు నరికారనే విషయం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఈ ఘటనకు సంబంధించి అక్కడ ఉన్న వ్యక్తులను దేవేంద్ర నాయుడు కుటుంబ సభ్యులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ క్రమంలో వివాదం చోటుచేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై దేవేంద్ర నాయుడు కుటుంబ సభ్యులు ఎస్‌ఆర్ పురం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపినట్లు సమాచారం. ఘటనకు బాధ్యులెవరనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

## వైభవంగా ఆరిమాని గంగమ్మ దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**ఎస్‌ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 11:**



ఎస్‌ఆర్‌పురం మండలం తయ్యూరు పాయకట్టు వద్ద వెలసిన శ్రీ ఆరిమాని గంగమ్మ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణ, అఖండ దీపప్రతిష్ఠ, అమ్మవారికి అభిషేకం, హోమాలు, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం శ్రీశైలపుత్రి అలం కారంలో అమ్మవారి గ్రామోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎస్‌ఆర్ పురం మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, గంధమ నేని రాజశేఖర్ నాయుడు హాజర య్యారు. పది రోజులపాటు మధ్యాహ్నం హరికథా కార్యక్రమాలు, అన్నదానం, రాత్రి నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వెంకట్ రాయల్, చైర్మన్ జలేంద్ర నాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 11:**



పలమనేరు పట్టణంలోని రంగాపురంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే ఎన్. అమరనాథ్ రెడ్డి దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి సన్మానించారు. రంగాపురంలో తొలిసారిగా అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్న ప్రాంతవాసులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## సరికొత్త రికార్డు దిశగా పలమనేరు మున్సిపాలిటీ అభివృద్ధి

●రూ.75 కోట్లతో మౌలిక వసతుల పనులు. : ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 11:**



పలమనేరుపట్టణ సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా గతంలో ఎన్నడూలేని విధంగా భారీగా నిధులు తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే ఎన్. అమరనాథరెడ్డి తెలిపారు. ఆదివారం 'మీ ఎమ్మెల్యే.. మీ వద్దకు' కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని 1, 2, 3, 4, 32, 34, 35 వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ లైన్లు, పారిశుధ్యంపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతుల పనులకు సుమారు రూ.75 కోట్లతో అనుమతులు లభించాయని వెల్లడించారు. తాగునీటి పైప్‌లైన్ల మార్పిడికి రూ.12.50 కోట్లు, పెద్ద చెరువు సుందరీకరణకు రూ.2.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా శుద్ధి చేసే పనులను రూ.18.50 కోట్లతో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కౌండిన్య రిజర్వాయర్, వాటర్ గ్రిడ్ ద్వారా నిరంతర తాగునీటి సరఫరాకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. రాబోయే ఆరు నెలల నుంచి ఏడాది లోపు విస్తరణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, టీడీపీ, జనసేన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన




**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 11:**
రేణిగుంట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం లైన్స్ క్లబ్ ఆఫ్ రేణిగుంట జంక్షన్,తిరుపతి అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.కంటి చూపు సమస్య ఉన్న అనేకమంది వైద్య శిబిరానికి చేరుకొని కంటికి పరీక్షలు చేసుకున్నారు. నిపుణులైన వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ రేణిగుంట జంక్షన్ ప్రతినిధులు వచ్చిన వారికి మజ్జిగ, మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ రేణిగుంట జంక్షన్ అధ్యక్షుడు జూలియన్ రాజు మాట్లాడుతూ అడిగిన వెంటనే కాదనకుండా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు ముందుకొచ్చిన తిరుపతి అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్స్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. వైద్య శిబిరాన్ని నిర్వహించుకునేందుకు అనుమతులు ఇచ్చిన ఎంపీడీవో, ఇతర అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మునుముందు కూడా లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు రేణిగుంట జంక్షన్ లైన్స్ అందరూ సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ రేణిగుంట జంక్షన్ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర, ట్రెజరర్ కోటేశ్వరరావు, సభ్యులు గంగారి రమేష్, ప్రభాకర్,నవీన్, నరేష్, అరుణ్ పాండ్యన్, అనిల్, ప్రభు, లోకనాధ నాయుడు,మురళి తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆలయంలో దండి నరేంద్ర ప్రత్యేక పూజలు

### దసరా నవరాత్రి ఉత్సవాల్లో బొమ్మల కొలువు కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకుడు

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్11:**



శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వ హించిన బొమ్మల కొలువు కార్యక్రమంలో జనసేన నాయకుడు దండి నరేంద్ర పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ బోర్డు సభ్యుడు పగడాల ప్రతాప్ ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ చైర్మన్ రేణుకాదేవి తో దండి నరేంద్ర సమావేశమై ఆలయ అభివృద్ధి, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ క్షేమంతో పాటు రైతుల సంక్షేమం, పశు పక్ష్యాదుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు దండి నరేంద్ర తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో సేవలంది స్తున్న ఆలయ కల్యాణ మండపాన్ని ఆయన అభినందించారు. ఈ కల్యాణ మండప నిర్మాణం సాకారం కావడంలో విశేష కృషి చేసిన మాజీ మంత్రి, దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమం ఆద్యంతం తనకు సహకరించిన ఆలయ బోర్డు సభ్యుడు పగడాల ప్రతాప్‌కు దండి నరేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పగడాల సుధాకర్, జనసేన సీనియర్ నాయకులు, రిటైర్డ్ ఎంఆర్ఓ చంద్రశేఖర్ రావు, బీసీ సీనియర్ నాయకుడు ఎస్.వి. రమణ, ఆలయ బోర్డు సభ్యుడు శేషు తదితరులతో పాటు భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడిగా జె.వి. అనిల్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక



**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,అక్టోబర్ 11:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడిగా శ్రీ సత్యసాయి జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జె.వి. అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఏలూరు జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఎన్నికల్లో ఆయన ఉపాధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేయగా, ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల ఫుట్‌బాల్ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కోటగిరి శ్రీధర్ ఎన్నిక కాగా, నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జె.వి. అనిల్ కుమార్‌కు పట్టణ ప్రజలు, సన్నిహితులు, క్రీడాకారులు అభినందనలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడ మరింత అభివృద్ధి చెందుతుందని క్రీడాభిమానులు ఆకాంక్షించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో 38వ వార్డులో బూత్‌ల పరిశీలన



**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,అక్టోబర్11:**
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో హిందూపురం పట్టణంలోని 38వ వార్డు పరిధిలో ఉన్న బూత్‌లను ఆదివారం పోలీసు అధికారులు పరిశీలించారు. అంబేద్కర్ నగర్, వాల్మీకి నగర్, సూరప్ప కట్ట కింద ప్రాంతం, కొల్లాపూర్ అమ్మ గుడి వీధి పరిసరాల్లోని బాపూజీ పాఠశాల తదితర ప్రాంతాలను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా తాగునీరు, లైటింగ్, పారిశుధ్య సౌకర్యాల పై వివరాలు తెలుసుకున్నట్లు మాజీ కౌన్సిలర్ నాగేంద్రమ్మ తెలిపారు. బూత్‌ల వద్ద ఓటర్లకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని అధికారులు పేర్కొన్నట్లు ఆమె వెల్లడించారు. ఈ పరిశీలనలో టూ టౌన్ ఎస్ఐ,ఏఎస్ఐ, కానిస్టేబుళ్లతో పాటు గణేష్,టీడీపీ నాయకులు సుద్దకుంట అంజి, బ్రిటిష్ మూర్తి, రాజేష్, కదిరయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

## హిందూపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా బాలకృష్ణ ఎన్నిక

### ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్, కోశాధికారిగా లక్ష్మిరెడ్డి విజయం




**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 11:**
హిందూపురం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం బ్యాలెట్ పద్ధతిలో ప్రశాంతంగా జరిగాయి. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా వి. బాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్, కోశాధికారిగా లక్ష్మిరెడ్డి విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శి పదవికి జరిగిన పోటీలో ప్రదీప్ 28 ఓట్లు సాధించి, తన సమీప ప్రత్యర్థి అంజప్ప (21 ఓట్లు)పై ఏడు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మరో అభ్యర్థి ప్రశాంత్‌కు ఆరు ఓట్లు వచ్చాయి. కోశాధికారి పదవికి జరిగిన ఎన్నికలో లక్ష్మిరెడ్డి 29 ఓట్లు సాధించి, గిరీష్ బాబు (26 ఓట్లు)పై మూడు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కౌంటింగ్ అనంతరం ఫైవ్‌మెన్ కమిటీ నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి ప్రదీప్, కోశాధికారి లక్ష్మిరెడ్డికి ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను అందజేసింది. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన సభ్యులకు కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

చదవండి.. చదివించండి
చిత్తూరు ఎక్స్‌ప్రెస్

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APETL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# అడవితల్లి బాట లక్ష్యం అదే

-మొదటిపేజీ తరువాయి

మార్కెట్ సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో పీఎం-జన్మన్, పీఎంజీఎస్‌వై-4, ఉపాధి హామీ పథకాల సమన్వయంతో 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని ప్రారంభించాం. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, పోలవరం, శ్రీకాకుళం, విజయనగరం, నంద్యాల, ఏలూరు జిల్లాల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఈ కార్యక్రమం కింద 858 గిరిజన ఆవాసాలకు 1,662 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి రూ.1,406 కోట్లతో పనులు చేపట్టాం. ఇదే స్ఫూర్తితో అడవితల్లి బాట 2.0 ద్వారా మరో 1,341 ఆవాసాలకు 1,976 కిలోమీటర్ల మేర రహదారులు, 45 వంతెనల నిర్మాణం కోసం రూ.2,052 కోట్లతో మొత్తం 2,569 పనులను మంజూరు చేశాం.

2018లో చేపట్టిన పోరాట యాత్ర సందర్భంగా ఉత్తరాంధ్ర ఏజెన్సీ ప్రాంతాల్లోని అనేక గిరిజన గ్రామాలను సందర్శించి, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నాను. రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల గిరిజన ప్రాంతాలు అభివృద్ధికి ఎంత దూరంగా ఉన్నాయో అర్థం చేసుకున్నాను. అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాం. అయితే, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం సాధారణ గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే ఎంతో క్లిష్టమైన ప్రక్రియ. కొండల మధ్య కిలోమీటర్ల మేర మార్గాలను ఏర్పాటు చేయడంతోపాటు, భారీ బండరాళ్లను తొలగించాలి. అవసరమైన చోట రాక్ కట్టింగ్, కంట్రోల్ బ్లాస్టింగ్ చేపట్టాలి. కొండ వాలులను స్థిరపరిచి, రహదారికి పటిష్ఠమైన పునాది వేసిన తర్వాత గ్రావెల్, ఇతర పొరలను ఏర్పాటు చేసి బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉంటుంది.

### 83 వేల మంది రైతులకు లబ్ధి

గిరిజన కుటుంబాలకు స్థిరమైన ఆదాయాన్ని కల్పించి, వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఉద్యానవనాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉపాధి హామీ, వీబీ-జీ రామ్ జీ పథకాల ద్వారా గిరిజన ప్రాంతాల్లో 85 వేల ఎకరాల్లో ఉద్యానవనాలను అభివృద్ధి చేసి, సుమారు 83 వేల మంది రైతులకు లబ్ధి చేకూర్చాం. ఏజెన్సీ ప్రాంతాల్లో కాఫీ సాగును ప్రోత్సహించడంతో పాటు, కాఫీ తోటలకు నీడనిచ్చే సిల్వర్ ఓక్ వంటి మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. అలాగే, గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాన్ని అభివృద్ధి చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాం. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు సుంకరమెట్ట కాఫీ తోటల్లో వుడెన్ బ్రిడ్జి, కానోపీ వాక్‌లను నిర్మించాం. మారేడుమిల్లిలో 11 హెక్టార్ల విస్తీర్ణంలో అరోమా కానోపీ వాక్, ట్రెక్కింగ్ వంటి కార్యకలాపాల ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నాం. నల్లమలలో జంగిల్ సఫారీని అభివృద్ధి చేయడం ద్వారా చెంచు గిరిజన కుటుంబాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రకృతి



పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

మైదాన ప్రాంతాల్లో నివసించే బంజారా, యానాది, యెరుకుల గిరిజన ఆవాసాలకు కూడా రహదారి సౌకర్యం కల్పిస్తున్నాం. పల్లెపండుగ కార్యక్రమం కింద ఇప్పటికే 167 ఆవాసాలకు 111 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించాం. పల్లెపండుగ 3.0 ద్వారా మరో 84 ఆవాసాలకు 63.4 కిలోమీటర్ల రహదారుల నిర్మాణ పనులు చేపట్టాం. అలాగే, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో సీఎస్ఆర్ నిధులతో 25 అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నాం. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు, నంద్యాల జిల్లాల్లో జల్ జీవన్ మిషన్ కింద రూ.406 కోట్లతో 3,776 సింగిల్ విలేజ్ స్కీమ్ పనులు కొనసాగుతున్నాయి. మొత్తంగా పల్లెపండుగ కార్యక్రమం ద్వారా సుమారు రూ.7,481 కోట్లతో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

### రహదారులు, మొబైల్ కనెక్టివిటీకి అనుమతులు

గిరిజన ప్రాంతాల్లో రహదారులు, మొబైల్ కనెక్టివిటీ, పర్యాటక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, గిరిజన కుటుంబాల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అటవీ శాఖ నుంచి 555 రహదారి పనులు, 136 సెల్ టవర్ల ఏర్పాటు, 48 ప్రాంతాల్లో ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ నిర్మాణానికి ఇప్పటికే అనుమతులు మంజూరు చేశాం. మిగిలిన అటవీ అనుమతులు కూడా త్వరితగతిన లభించేలా చర్యలు తీసుకుంటున్నాం. అరకులోని దుంబ్రిగుడ, కురిడి గ్రామాలను సందర్శించినప్పుడు సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న వారితో పాటు, తీవ్రమైన రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్న గిరిజన గర్భిణుల ఇబ్బందులను గుర్తించాం. అత్యవసర సమయాల్లో వారికి సకాలంలో రక్తం అందించాలనే లక్ష్యంతో అరకు ఏరియా ఆసుపత్రిలో సుమారు రూ.కోటి సీఎస్ఆర్ నిధులతో ప్రత్యేక బ్లడ్ బ్యాంకును నిర్మిస్తున్నాం. వ్యవసాయ ఉత్పాదకతను పెంచి, రైతులకు ఆధునిక వ్యవసాయ పనిముట్లను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రధానమంత్రి కృషి సించాయి యోజన 2.0 వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కంపోనెంట్ కింద రూ.68 కోట్లతో చేపట్టిన కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభిస్తున్నాం. రాష్ట్రంలోని 59 వాటర్‌షెడ్ ప్రాజెక్టుల పరిధిలో 34 వేల మందికి పైగా అర్హులైన రైతులకు 38 రకాల, 3 లక్షలకు పైగా వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేయనున్నాం. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లను అందిస్తున్నాం.

### స్థానిక సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

వేములకొండ, రాకోట, సువర్లవాడ, దారగూడెం, దబ్బబయలస, తిరుగతిరళ్ళు, కాకవాడ, చకలవీధి, వెట్టిచెలకలు, సోకులగూడెం గ్రామాల ప్రజలతో నిర్వహించిన మాటామంతీ కార్యక్రమంలో స్థానికులు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన సమస్యలు, అవసరాలను నా దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నింటినీ మంజూరు చేస్తూ, సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపట్టి, పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని ఆదేశిస్తున్నాను. గిరిజనుల హక్కులను గౌరవిస్తూ, వారి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, అడవులను కాపాడే వారి జీవితాల్లో వెలుగులు నింపి, అభివృద్ధి ఫలాలను ప్రతి గిరిజన ఆవాసానికి చేర్చడమే కూటమి ప్రభుత్వ సంకల్పం. అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు

# ఆర్థిక నేరాల కేసుల నుంచి తప్పించుకునేందుకే జగన్ కాలయాపన

-మొదటిపేజీ తరువాయి

వేస్తున్నారని ధ్వజమెత్తారు. తన పత్రికలో తప్పుడు కథనాలు, కార్టూన్లతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గుడ్డ కాల్చి ఎదుటివారి మీద వేయడం జగన్‌కు అలవాటుగా మారిందని, దర్యాప్తు సంస్థల విచారణకు రాజకీయ రంగు పులుముతున్నారని ఆరోపించారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ సుమారు రూ.48 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై 2011లో కాంగ్రెస్ హయాంలోనే సీబీఐ కేసులు నమోదు చేసిందని మంత్రి గుర్తుచేశారు. "షెల్ కంపెనీలను సృష్టించి, కంపెనీల వాటాల విలువను కృత్రిమంగా పెంచి, మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారనేది ప్రధాన ఆరోపణ. ఈ కేసుల నుంచి తప్పించుకునేందుకే ఇప్పుడు జగన్ నానా తంటాలు పడుతున్నారు" అని రవీంద్ర వివరించారు.

### వివేకా హత్య నుంచి ఈడీ విచారణ వరకు.. అన్నీ నాటకాలే

తన బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోనూ జగన్ రాజకీయ నాటకాలు ఆడారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. "అప్పట్లో చంద్రబాబుపై నిందలు వేస్తూ 'నారాసుర రక్త చరిత్ర' అంటూ సాక్షి పత్రికలో కథనాలు రాయించారు. కానీ, ఆయన చెల్లెలు సునీత న్యాయపోరాటంతో నిజాలు వెలుగులోకి వచ్చి, విచారణ తాడేపల్లి ప్యాలెస్ వైపు దారితీయలేదా?" అని జగన్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం ఈడీ విచారణ వేగవంతం అవుతుండటంతో, దానిని అడ్డుకునేందుకు జగన్ 4,000కు పైగా డిశ్చార్జ్ పిటిషన్లు వేసి




కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.

### అసత్యాల 'సాక్షి'.. దర్యాప్తు సంస్థలపై దుష్ప్రచారం

అవినీతి సొమ్ముతో ఏర్పాటైన సాక్షి పత్రిక, పేరుకు మాత్రమే సాక్షి అని, అది అసత్యాలకు నిలువుటద్దంగా మారిందని కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ఈడీ అనేది కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని స్వతంత్ర దర్యాప్తు సంస్థ అని, రాష్ట్ర ప్రభుత్వానికి దానితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. "విచారణ వేగవంతం అవుతుంటే, దానిపై రాజకీయ కక్ష సాధింపు అని ముద్ర వేస్తూ సాక్షిలో కార్టూన్లు, కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇది దర్యాప్తు సంస్థల మనోస్థైర్యాన్ని దెబ్బతీయడమే" అని అన్నారు.

### ఆర్థిక నేరాలు సమాజానికి క్యాన్సర్ వంటివి

ఆర్థిక నేరాలు దేశ ఆర్థిక వ్యవస్థకు, సమాజానికి క్యాన్సర్ వంటివని సుప్రీంకోర్టే చెప్పిందని మంత్రి గుర్తుచేశారు. "డబ్బుంటే కేసులను ఏళ్ల తరబడి సాగదీయవచ్చా? కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా విచారణను ఆలస్యం చేయవచ్చా? ఇది న్యాయవ్యవస్థను అపహాస్యం చేయడమే" అని రవీంద్ర మండిపడ్డారు. తన స్వార్థం కోసం కన్నతండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును సైతం కేసుల్లో ఏ5గా చేర్చే పరిస్థితికి జగనే కారణమయ్యారని, ఇది సిగ్గుచేటని విమర్శించారు. 16 నెలలు జైలులో ఉన్నా జగన్‌లో మార్పు రాలేదని, ఇప్పటికీ 'రప్పా రప్పా' అంటూ యువతను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు.

తప్పు చేసినవారు చట్టం నుంచి ఎప్పటికీ తప్పించుకోలేరని, విచారణలో కొంత ఆలస్యం జరిగినా శిక్ష అనుభవించడం ఖాయమని హెచ్చరించారు. కేసుల విచారణను వేగవంతం చేసి, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని దర్యాప్తు సంస్థలను, న్యాయస్థానాలను కోరారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా చట్టం నుంచి జగన్ తప్పించుకోలేరని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# నేడే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కారానికి

## పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,అక్టోబర్11:**

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం (అక్టోబర్ 12) చిత్తూరు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను పూర్తి వివరాలతో అధికారులకు



సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొననున్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను కూడా వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# విజయవాడ ఉత్సవాలను గ్రాండ్ సక్సెస్ చేయాలి

-మొదటిపేజీ తరువాయి

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని దిశానిర్దేశం చేశారు. అక్టోబర్ 13 నుంచి 31 వరకు పున్నమి ఘాట్‌లో నిర్వహించనున్న 'జాతీయ సరస్ మేళా-2026' దేశానికే ఆదర్శంగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ మేళాకు, దుర్గమ్మ దర్శనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతున్న నేపథ్యంలో ఆమె పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. దేశవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన కోసం 576 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, అందులో 208 స్టాళ్లు ఏపీకి చెందినవని అధికారులు వివరించారు. మన రాష్ట్ర మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను 'స్వయం ఏపీ' బ్రాండ్ కింద జాతీయ స్థాయిలో ప్రదర్శించి, విక్రయించేందుకు ఈ మేళా గొప్ప వేదిక కావాలని సీఎం అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0'ను కూడా ఘనంగా నిర్వహించాలని చంద్రబాబు చెప్పారు. మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా, ప్రజల భాగస్వామ్యంతో ఈ ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. ఈ వరుస కార్యక్రమాల వల్ల భక్తులు, పర్యాటకుల రాకతో ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు

-మొదటిపేజీ తరువాయి

విశేష అలంకరాల్లో దర్శనం ఇవ్వనున్నారు. దసరా నవరాత్రులు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రోత్సవాలు నేటి నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు దుర్గమ్మ బాలాత్రిపురసుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలిరోజు తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, అలంకార పూజలు నిర్వహించారు. భక్తులను ఉదయం 8 గంటల నుంచి దర్శనాలకు అనుమతించారు. రాత్రి 11 గంటల వరకూ దర్శనాలు కొనసాగుతాయి.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు పశ్చిమగోదావరి జిల్లాలో వేర్వేరు చోట్ల వైభంగా మొదలయ్యాయి. తణుకు మండలం మండపాకలో ఎల్లారమ్మ ఆలయంలో కలశ స్థాపనతో ప్రారంభమైన ఉత్సవాలు పది రోజులపాటు జరగనున్నాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. శరన్నవరాత్రుల మొదటి రోజు అమ్మవారు ముగ్ధ మనోహరమైన రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తణుకులోని కనకదుర్గ అమ్మవారి రజిత కవచాలంకృత అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి.

### శ్రీశైలంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

శరన్నవరాత్రులలో భాగంగా తూర్పుగోదావరిజిల్లా ఉండ్రాజవరం మండలం పాలంగిలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దసరా ఉత్సవాల ప్రారంభం రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమపూజలు నిర్వహిస్తున్నారు. అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైలం మహా క్షేత్రం శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆలయ ప్రాంగణాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారు భక్తులకు శ్రీ భ్రమరాంబ దేవి శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు.

అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనూ శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయాలు ముస్తాబు అయ్యాయి. పి. గన్నవరం నియోజకవర్గంలోని అంబాజీపేట. అయినవిల్లి, పి,గన్నవరం మామిడి కుదురు మండలాల్లో అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలోని కోటదుర్గమ్మ దేవస్థానంలో నేడు అమ్మవారు నిజరూప దర్శనంలో దర్శనం ఇచ్చారు. దసరా నేపథ్యంలో పట్టణంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

### 1108 కలశాలతో నగరోత్సవం

బాపట్ల జిల్లా చీరాలలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చీరాల సంతబజార్ లో కొలువై ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. 1108 కలశాలతో నగరోత్సవం నిర్వహించారు. పసుపు, కుంకుమలతో మహిళలు శాస్త్రోక్తంగా జలాభిషేకం చేశారు. అనంతరం కనకధారా పారాయణం చేశారు. అమ్మవారికి చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య ప్రత్యేక పూజలు చేశారు. దుర్గామాత శరన్నవరాత్రులు పురస్కరించుకొని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో కలశాలతో భవాని భక్తులు భారీ ఊరేగింపు నిర్వహించారు. డప్పులు మేళాలతో నృత్యాలు చేస్తూ కలశాల వీధుల్లో ఊరేగించారు. అనంతరం స్థానిక దుర్గాలమ్మ చెట్టు అమ్మవారి ఆలయ వద్ద మహిళా భక్తులు ఆలయ ప్రదర్శన చేశారు. మార్కాపురం జిల్లా గిద్దలూరులో వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన రహదారిపై విద్యుత్ కాంతులతో వెదజల్లుతున్న అమ్మవారి చిత్రపటం ఏర్పాటు చేశారు. నేటి నుంచి పది రోజులపాటు అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

# సీఎంఆర్ఎఫ్, టీడీపీ బీమా చెక్కుల పంపిణీ

**శాంతిపురం,చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 11:**



కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా ఆదివారం సీఎంఆర్ఎఫ్, టీడీపీ సభ్యత్వ ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేసినట్లు క్లస్టర్-1 ఇన్‌చార్జ్ జి.ఎన్. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఐదుగురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.25 లక్షల బీమా పరిహారం అందించామన్నారు. అలాగే 33 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.19,19,813 విలువైన చెక్కులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి మంజునాథ్ గౌడ్, కెన మాకులపల్లి సర్పంచ్ అభ్యర్థి ఎన్. శివకుమార్, కేద్రీనాథ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్య ఖర్చులకు భరోసా.. పేదలకు సీఎంఆర్ఎఫ్ అండ!

## కుప్పంలో రూ.22.77 లక్షల విలువైన చెక్కుల పంపిణీ

**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,అక్టోబర్ 11:**



ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు పొందుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి, కుప్పం ఎమ్మెల్యే నారా చంద్రబాబు నాయుడు సహకారంతో కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు రూ.22,77,030 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. కుప్పంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాణిపాకం వెంకటేష్, కడా అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఎస్. రాజ్‌కుమార్ తదితరులు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు ఈ ఆర్థిక సాయం ఎంతో ఊరటనిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 11వ క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, మాజీ మార్కెట్ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, మాజీ ఎంపీటీసీ కృష్ణన్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, వార్డు పార్టీ అధ్యక్షులు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల కోసం శ్రీ సత్యసాయి జిల్లాకు ఏఎస్పీ కె.వి. మహేష్ అటాచ్

**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,అక్టోబర్ 11:**



శ్రీసత్యసాయి జిల్లాలో త్వరలో జరగనున్న ఎన్నికల విధుల నిర్వహణ నేపథ్యంలో ఏఎస్పీ కె.వి. మహేష్‌ను అదే జిల్లాకు అటాచ్ చేస్తూ రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక జీఓనుకూడా విడుదల చేసింది. హిందూపురం సబ్‌డివిజన్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కె.వి.మహేష్‌కు పదోన్నతి లభించడంతో అనకాపల్లికి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే ఎన్నికల విధుల నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఆయనను శ్రీ సత్యసాయి జిల్లాలోనే కొనసాగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు డీజీపీ ఉత్తర్వులు వెలువడ్డాయి.

### మహాదేవమంగళలో అంగరంగ వైభవంగా

# దుర్గమ్మ దసరా నవరాత్రి మహోత్సవాలు

- 19వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు.. ప్రతిరోజూ భక్తులకు అన్నదానం



**గంగాధర నెల్లూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్11:**
చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలం మహాదేవమంగళ గ్రామంలో కొలువుదీరిన శ్రీ దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తూ ఉత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు ఆలయ నిర్వాహకులు జ్యోతిస్వర్ తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రతిరోజూ అమ్మవారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం వేళల్లో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి, పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

### ప్రతి ఇంటికి పండ్ల మొక్క.. పచ్చదనం పెంపునకు

# చారిటబుల్ ట్రస్ట్ ముందడుగు



**వి.కోట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 11:**
పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో వి.కోట మండలం బైరుపల్లి పంచాయతీ పరిధిలోని బంగ్లా ఊరు గ్రామంలో పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కళావతి, డాక్టర్ దశరథ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి ఇంటికి ఒక్కో పండ్ల మొక్కను అందించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మ ఎక్స్ అడిషనల్ సీఈవో కార్తిక్ చేతుల మీదుగా గ్రామస్థులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటిలో మొక్కలను నాటి సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో పండ్లను పొందే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళావతి, డాక్టర్ దశరథరెడ్డి ట్రస్ట్ సభ్యులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రయాణికుల కోసం బస్ షెల్టర్ ప్రారంభం

**వి.కోట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 11:**



వి.కోటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఏకే హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ తమీమ్ ఖాన్ తన తండ్రి దివంగత ఏకే ఖలీల్ ఖాన్ జ్ఞాపకార్థం అందించిన సహకారంతో నిర్మించిన ఈ షెల్టర్‌ను లయన్స్ 317 –ఈ జిల్లా గవర్నర్ ప్రొఫెసర్ ప్రతాప్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్ యాదవ్ మాట్లాడుతూ ఆరేళ్లుగా లయన్స్ క్లబ్ వి.కోటలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పేదలకు ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేయిస్తున్న తమీమ్ ఖాన్ సేవలను ప్రశంసించారు. త్వరలోనే వి.కోటలో ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు క్లబ్ కార్యదర్శి రమేష్ తెలి పారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తుకారామ్, ఆర్సీ లోకేష్, డీసీ ధీరజ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# హిందూపురం ప్రజలకు మరింత చేరువగా బ్యాంకింగ్ సేవలు

### నేడు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్ ప్రారంభం

**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్11:**

सेन्ट्रल बैंक ऑफ़ इंडिया
Central Bank of India

హిందూపురం పట్టణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేసేందుకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేసింది. అంబేద్కర్ సర్కిల్ సమీపంలోని సాగర్ రెసిడెన్సీ భవనంలో సోమవారం ఈ బ్రాంచ్ ప్రారంభం కానుంది. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో బ్రాంచ్‌ను ప్రారంభించ నున్నట్లు మేనేజర్ మీనాక్షి తెలిపారు. ఈ నూతన బ్రాంచ్ ద్వారా జన్‌ధన్ ఖాతాలు, రైతులకు పంట రుణాలు, బంగారు రుణాలు, విద్యార్థులకు విద్యా రుణాలు తదితర బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె వివరించారు. అర్హులైన ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పట్టణ ప్రజలు, ఖాతాదారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేనేజర్ మీనాక్షి విజ్ఞప్తి చేశారు.

# బీసీలకు 34 శాతం పార్టీ టికెట్లు.. టీడీపీ కట్టుబాటు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తాం
- కుప్పంలో బీసీ సమావేశంలో నాయకుల వెల్లడి





**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్11:**
కుప్పం నియోజకవర్గంలో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, సాధికారతతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి సముచిత ప్రాధాన్యత కల్పించే లక్ష్యంతో బీసీ సమావేశం నిర్వహించారు. ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీకేఎం–ఉడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్.సురేష్‌బాబు, సీఎం వ్యక్తిగత కార్యదర్శి శ్రీకాంత్, కడా అడ్వైజర్ కమిటీ సభ్యుడు ఎస్. రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బీసీల రాజకీయ భాగస్వామ్యంపై చర్చించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం పార్టీ టికెట్లు కేటాయించేందుకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు. బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడమే పార్టీ లక్ష్యమని తెలిపారు. దివంగత నందమూరి తారక రామారావు హయాం నుంచి బీసీలకు రాజకీయ గుర్తింపు, గౌరవం, అవకాశాలు కల్పించడంలో టీడీపీ కీలక పాత్ర పోషించిందని నాయకులు గుర్తుచేశారు. బీసీలకు గతంలో 20 శాతం రిజర్వేషన్లు కల్పించి, అనంతరం వాటిని 34 శాతానికి పెంచిన ఘనత టీడీపీదేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, గౌరవం, సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు.

# ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్

- సీఎం చంద్రబాబు నాయుడు క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు
- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్థిల్లాలని అమ్మవారికి వేడుకోలు





**కుప్పం, విజయవాడ, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్11:**
దసరా శరన్నవరాత్రుల తొలి రోజు సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దర్శించుకున్నారు. శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్మాతను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అమ్మవారి దర్శనం తనకు ఎంతో ఆనందాన్ని, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని జగన్మాతను మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు లభించాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రైతుల సంక్షేమం, ప్రజల ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. దసరా శరన్నవరాత్రులు ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని, జగన్మాత దుర్గాదేవి కరుణాకటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కంచర్ల శ్రీకాంత్ ఆకాంక్షించారు. అమ్మవారి దీవెనలతో ప్రజలందరూ సిరిసంపదలతో, సుఖశాంతులతో వర్థిల్లాలని కోరుకున్నారు.

**ప్రముఖుల సమక్షంలో దర్శనం**
ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తదితరులతో కలిసి కంచర్ల శ్రీకాంత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శరన్నవరాత్రుల ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

# స్థానిక సమరానికి కాంగ్రెస్ సన్నద్ధం

- అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధం:
- డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 11:**
శ్రీకాళహస్తి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందని తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు స్పష్టం చేశారు. ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసే లక్ష్యంతో ఆయన ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బాలగురవం బాబు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి మరింత బలంగా వెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలకు తెలియజేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలిచే పార్టీ అని, పేదలు, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ప్రజలకు వివరించి ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ప్రజల ఆదరణ కాంగ్రెస్‌కే తలపాదామోదరం రెడ్డి కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తారని తలపా దామోదరం రెడ్డి అన్నారు. దేశ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమవుతాయని పేర్కొన్నారు. నేడు ప్రతి వ్యవస్థలో నిర్బంధ వైఖరి కొనసాగుతోందని విమర్శించారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మాంగాటి గోపాల్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, కర్ణాటక రాష్ట్ర ఓబీసీ పరిశీలకుడు మురళి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు జ్యోతీశ్వర్ నాయక్, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త నరసయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాం, జిల్లా కలెక్టరేట్ రిప్రజెం టేటివ్ చైర్మన్ చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, మణి, జిల్లా కార్యదర్శి ఇళయరాజా, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రావణన్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంటోనీతో పాటు నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన కార్యకర్తలకు అండగా జనసేన పార్టీ

### స్థానిక సంస్థల ఎన్నికల కోటాలో రాజీఉండదు



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్11:**
రేణిగుంట మండల అధ్యక్షులు చినతోటి నాగరాజు గారు, రేణిగుంట పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి, మరియు రేణిగుంట మండల నాయకుల ఆహ్వానం మేరకు, జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీ లో చేరి తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్తగా నియమితులైన శ్రీ మిద్దెల హరి , జనసేన పార్టీ నాయకులు సత్రవాడ ప్రవీణ్ రేణిగుంట మండల జనసేన పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం స్థానిక రేణిగుంట పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో రేణిగుంట మండల సమస్యలు, రాబోయే స్థానిక ఎన్నికల గురించి మండల నాయకులు తో విపులంగా చర్చించడం జరిగింది. మిద్దెల హరి మాట్లాడుతూ అందరితో కలసి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన పార్టీ యొక్క గెలుపు స్థానాలను పార్లమెంట్ కమిటీ ద్వారా పరిశీలించి, కూటమి రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకొని జనసేన పార్టీ స్థానిక సంస్థల కోటా విషయంలో రాజీ లేకుండా రేణిగుంట మండలానికి సరైన ప్రాతినిధ్యం వచ్చేలా చూస్తామని తెలిపారు, తిరుపతి పార్లమెంట్ కార్యనిర్వాహకదళ సభ్యుడిగా నియమితులైన చినతోటి నాగరాజుని శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. సత్రవాడ ప్రవీణ్ మాట్లాడుతూ.. రేణిగుంట మండలంలో జనసైనికులకు, నాయకులకు ఎటువంటి సమస్య వచ్చిన ముందుండి సమస్య తీరడానికి పూర్తిగా అండగా నిలుస్తామని జనసేన సీనియర్ నాయకులు, జనసైనికులు , వీర మహిళలను, కార్యకర్తలను అందరిని కలుపుకొని శ్రీకాళహస్తి నియోజకవర్గం లో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో..రేణిగుంట మండలం ప్రెసిడెంట్ మరియు తిరుపతి పార్లమెంట్ నిర్వాహకదళ్ సభ్యులు చిన్న తోట నాగరాజు, రేణిగుంట టౌన్ ప్రెసిడెంట్ ఆకుల భాగ్యలక్ష్మి, రేణిగుంట ఐటి కోఆర్డినేట్ దీన్ దయాల్ ,సీనియర్ నాయకులు, త్యాగరాజు, మాజీవార్డ్ నెంబర్ మహబూబ్ భాషా, ఎస్.ఎం.సి. గర్ల్స్ హై స్కూల్ చైర్మన్ సుజా తా , వైస్ చైర్మన్ కరీముల్లా, కోఆర్డినేట్ నెంబర్ అనురాధ, జనసేన నాయకులు.. పార్థసారధి, ముఖేష్, రమేష్, మునికృష్ణ, సలీం, తిలక్, ఆర్.సతీష్,వెంకటేష్,బసవపున్నయ్య, నరేష్ కుమార్, యస్.రమేష్, మహేష్, వీరమహిళలు, జనసైనికులు పాల్గొనడం జరిగింది.

# వైభవంగా దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు

### తొలిరోజు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు



**వి.కోట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 11:**
వి.కోట మండల కేంద్రంలోని దుర్గానగర్‌లో కొలువుదీరిన దుర్గామాత ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద మంత్రోచ్చారణల నడుమ గణపతి హోమం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలిరోజు బాలాత్రిపురసుందరిగా అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో విజయకుమార్ రాజు కుటుంబ సభ్యులు, ధర్మకర్త రఘుపతినాయుడు, మాజీ ధర్మకర్త ఎస్.ఆర్. దామోదర్ రెడ్డి, ఆలయ పెద్దలు సి. రామచంద్ర నాయుడు, మాజీ ఎంపీడీవో రమేష్, ఉపధర్మకర్తలు నరసింహారెడ్డి, మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు హాజరయ్యారు.

Edited Printed Published & Owned by K.L.Krishnam Raju. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 19/86-1, Jaya prakash Road, Kuppam, Chittoor District, Andhra pradesh. EDITOR K L KRISHNAM RAJU, RNI. NO. APTEL/2023/86143, Cell : 9440815774